క్లుప్తంగా

సమయపాలన పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలో చిట్కుల్, చిలప్‌చెడ్, ఫైజాబాద్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె దవాఖానా సిబ్బంది సమయపాలన పాటించాలని కొడిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. బుధవారం ఆయన చిట్కుల్ పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు, రోగులకు పంపిణీ చేసే మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె దవాఖానా సిబ్బంది సరైన సమయానికి దవాఖానాలు తెరవాలని, సమయం పూర్తయ్యాకే మూసివేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రమేశ్, హెల్త్ సెక్రెటరీ సృజన పాల్గొన్నారు.

పాకిస్తాన్ దిష్టిబొమ్మ దహనం



దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బజరంగ్‌దళ్ కార్యకర్తలు

పాపన్నపేట(మెదక్): వైష్ణోదేవి ఆలయానికి వెళ్తున్న భక్తులపై పాకిస్తాన్ ముష్కరులు జరిపిన దాడిని నిరసిస్తూ బుధవారం పాపన్నపేటలో బజరంగ్‌దళ్ కార్యకర్తలు పాకిస్తాన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. భజరంగ్ దళ్ మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, పవన్, భాగేష్, శివ, నరేష్ పాల్గొన్నారు.

పిడుగుపాటుతో గేదె మృతి



రోదిస్తున్న బాధితుడు శ్రీనివాస్

చిలప్‌చెడ్(నర్సాపూర్): పిడుగుపడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని ఫైజాబాద్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, గేదె యజమాని మ్యాకల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతీరోజు మాదిరిగానే గేదెను పొలం వద్ద ఉన్న చెట్టు కింద కట్టేశానని, రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడడంతో గేదె మృతి చెందిందన్నారు. బుధవారం ఉదయం వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వివరాలు సేకరించారు. కాగా రోజు 12 లీటర్ల పాలు ఇచ్చే గేదె మృతితో, జీవనోపాధి కోల్పోయామని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

కూలిన ఇల్లు



మల్లుపల్లిలో ఈదురుగాలుల వర్షంతో కూలిన రేకుల ఇల్లు

చిన్నశంకరంపేట(మెదక్): ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో మండలంలోని మల్లుపల్లి గ్రామంలో నివాస గృహం కూలిపోయింది. ఫలితంగా గృహంలో నివాసం ఉంటున్న పొన్నబోయిన నాగరాజు, భూపాల్ నిరాశ్రయులయ్యారు. నిరుపేదలైన ఇరువురు అన్నదమ్ములు అప్పుచేసి రేకుల ఇంటిని నిర్మించారు. రాత్రి కురిసిన వర్షంతో రేకులు పూర్తిగా ఎగిరిపోయి ఇంటి ముందు పడిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది

నర్సాపూర్: ఆర్థిక శాఖ జారీ చేసిన 970జీఓతో ఉద్యోగ భద్రత కోల్పోయే ప్రమాదం ఉందని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అన్నారు. బుధవారం పురపాలక, మున్సిపల్ కార్పొరేషన్‌ల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది తాజాగా తెచ్చిన జీఓను సవరించి తమ ఉద్యోగ పోస్టులు, పెంచిన వేతనాలు అమలు చేసేలా కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందికి పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు సురేష్, బాల్‌రెడ్డి, భిక్షపతి, కమిషనర్ జైత్‌రాంనాయక్ సంఘీభావం తెలిపారు. మున్సిపాలిటీలో ఉద్యోగులు మురళీ, పాపారావు, విష్ణు, రాజు తదితరులు ఉన్నారు.

బడిగంట మోగిన వేళ
విద్యార్థుల ఆనందహేల

జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు వినూత్నంగా విద్యార్థులకు స్వాగతం పలికారు. కొన్నిచోట్ల గులాబీ పూలతో, బ్యాండ్ కొడుతూ పిల్లలకు వెల్‌కం చెప్పారు. మరికొన్ని చోట్ల పుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు.



చేగుంట(తూప్రాన్): వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలకు చేరుకుంటున్న విద్యార్థులు



పాపన్నపేట ఉన్నత పాఠశాలలో పూలతో విద్యార్థులకు స్వాగతం చెబుతున్న ఉపాధ్యాయులు



చేగుంట(తూప్రాన్): పొలంపల్లిలో విద్యార్థులకు యూనిఫాం అందిస్తున్న ఉపాధ్యాయులు



కొడిపల్లి(నర్సాపూర్): పాఠశాలలో యూనిఫామ్స్ అందిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం సంగమేశ్వర్



శివ్వంపేట(నర్సాపూర్): పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ హరికృష్ణ



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధ్యాయులకు యూనిఫామ్స్ అందిస్తున్న ఐకేపీ సిబ్బంది



నర్సాపూర్ రూరల్: పెద్ద చింతకుంటలో పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలతో విద్యార్థులు



రేగోడ్(మెదక్): పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ జయప్రకాశ్



నిజాంపేట(మెదక్): నస్కల్ గ్రామంలో ..



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో ..



విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు

డాక్టర్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కమలాపూర్, బుజ్రాన్‌పల్లి గ్రామాల్లో బడిబాటలో భాగంగా విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్‌తో పాటు పుస్తకాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు టెట్, డీఎస్సీ ద్వారా ఎంపికై ఉత్తమ విద్యాబోధన చేస్తున్నారని, త్వరలో 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేపడతామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయుల సమస్యలతో పాటు పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్ బాయి, ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా, నాయకులు సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, నారాగౌడ్, సంగమేశ్వర్, కుంట్ల రాములు, సత్యనారాయణ, కుంట్ల శ్రీను,విఠల్, సంగయ్య, ఏపీఎం గోపాల్, నోడల్ అధికారి వెంకటేశం తదితరులున్నారు.

ఉపాధ్యాయులు ఎక్కువ.. విద్యార్థులు తక్కువ



కొడిపల్లి ఉన్నత పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లి ఉన్నత పాఠశాలలో మొదటి రోజు బడి ప్రారంభం అయింది. ఉపాధ్యాయులు అందరూ వచ్చారు కానీ కొందరూ విద్యార్థులే వచ్చారు. బుధవారం పాఠశాల ప్రారంభం కావడంతో పాఠశాలలో ప్రార్థన సమయానికి ఉపాధ్యాయులు, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, సీఆర్‌పీ కలిపి మొత్తం 14మంది విధులకు హాజరయ్యారు. కాగా విద్యార్థులు మాత్రం కేవలం 11మంది మాత్రమే హాజరు అయ్యారు. పాఠశాల గజిటెడ్ హెచ్‌ఎం లలితా దేవి అరగంట ఆలస్యంగా బడికి వచ్చారు. ఇది సక్సెస్ పాఠశాల కావడంతో ఇక్కడ 450 మంది విద్యార్థులు ఉన్నారు. కేవలం 11 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు.

నక్షబాట పునరుద్ధరించాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): నక్షబాట తొలగించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొని బాటను పునరుద్ధరించాలని రైతులు బుధవారం డిమాండ్ చేశారు. మండలంలోని కొంతన్‌పల్లి గ్రామ పరిధిలోని కరీంకుంటతో పాటు పలువురు రైతుల పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన నక్షబాటను ఓ వెంచర్ నిర్వాహకులు, పలువురు వ్యక్తులు కబ్జా చేసి తొలగించారు. దీంతో పొలాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని బాధిత రైతులు తహసీల్దార్ శ్రీనివాస్‌చారిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. నక్షబాటను తొలగించిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిషన్, సర్వేయర్ కార్తిక్, తదితరులు ఉన్నారు.

కొడిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

ఇన్‌చార్జి పిన్సిపాల్ డాక్టర్ దామోదర్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదర్

కొడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కొడిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ తెలిపారు. బుధవారం కొడిపల్లి జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటరామారావ్‌తో కలిసి పలువురు విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలు, తండాల్లోని విద్యార్థులకు కొడిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరమని చెప్పారు. ప్రస్తుతం రెండో విడత దోస్త్ కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. ఇక్కడ ఇప్పటివరకు కేవలం 15 మంది విద్యార్థులు మాత్రమే అడ్మీషన్లు పొందారని చెప్పారు. దోస్త్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకొని ఇతర కాలేజీలో చేరిన విద్యార్థులు సైతం స్లాట్ బుక్ చేసుకొని రెండు, మూడో విడత కౌన్సిలింగ్‌లో కళాశాల మార్పు చేసుకోవచ్చన్నారు. ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలన్నారు. కొడిపల్లి, కొల్చారం జూనియర్ కళాశాల విద్యార్థులతో పాటు మిగతా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాల కోసం కొడిపల్లి, కొల్చారం జూనియర్ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

రైతులకు విత్తనాలు అందజేత



రాంపూర్‌లో మహిళలకు విత్తనాలు అందిస్తున్న సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల మహిళా రైతులకు సెహగల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాంపూర్‌తో పాటు మక్కరాజీపేటలో విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ వాణి మాట్లాడుతూ.. మండలంలోని 10 గ్రామాలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో దత్తత తీసుకొని మహిళా రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డ్రమ్ సీడర్‌తో వరి నాటుకునే పద్ధతులను వివరించారు. ఈ పద్ధతిలో అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. వరి, మొక్కజొన్న, కంది విత్తనాలు క్రిమి సంహారక మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు శ్రవణ్, విజయ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు



బోనంతో జోగిని వెన్నెల, తదితరులు

నర్సాపూర్ రూరల్: పట్టణంలో రేణుక ఎల్లమ్మ ఆలయం 13వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా ఉదయం గణపతి పూజ, హోమం, సామూహిక కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం నర్సాపూర్ మార్కెట్ రోడ్డు మీదుగా ఎల్లమ్మ ఆలయం వరకు మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, యువకుల నత్యాలు, జోగిని వెన్నెల బోనం ఆకట్టుకుంది. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం



తంప్లూర్‌లో ఎడ్లతో అచ్చుకొడుతున్న రైతు



బొడ్మట్‌పల్లిలో విత్తనాలు విత్తుతున్న కూలీలు

టేక్మాల్(మెదక్): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సాగు పనులు జోరందుకున్నాయి. రైతులు దున్నడం, విత్తనాలు విత్తడం, మందులు చల్లడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఎడ్లతో కొట్టె అచ్చులు, ట్రాక్టర్లు, మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది.



మిరుదొడ్డిలో మూతబడిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

మూడేళ్లుగా మూత ‘బడి’



బడికి వేసిన తాళం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి మండల కేంద్రంలో సకల హంగులతో కూడిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అన్ని మౌలిక వసతులు ఉన్నాయి. విద్యార్థులు మాత్రం లేరు. మూడేళ్లుగా ఈ పాఠశాలలో అడ్మిషన్లు లేకపోవడంతో ఇక్కడ పని చేసిన టీచర్లను డిప్యూటేషన్లపై పంపించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు లేక మరోసారీ మూత బడింది. ఈ పాఠశాలను జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకవడంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ పునఃప్రారంభోత్సవానికి నోచుకోలేదు.

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి



డ్వాక్రా గ్రూపు సభ్యులతో మాట్లాడుతున్న పెన్నిఫిక్స్ సంఘ సభ్యులు

హవేళిఘణాపూర్(మెదక్): గ్రామీణ ప్రాంత మహిళలకు స్వయం ఉపాధి పెంచేందుకు డ్వాక్రా మహిళల అభ్యున్నతికి డాక్యుమెంటరీని తయారు చేస్తామని పెన్నీ, ఫిక్స్ ప్రాజెక్టు సభ్యులు డాక్టర్ నారాయణబాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా బుధవారం మెదక్ మండలం మాచవరంలో డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యార్థి ఆనిక మాట్లాడుతూ.. ఈ నూతన పెన్నీ, పిక్స్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశ్యం గ్రామీణ ప్రాంతాల మహిళల వృత్తిని, ఆర్థిక నైపుణ్యాన్ని మరింత మెరుగు పరిచి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే అన్నారు. ప్రధానంగా ఆధునిక ఆర్థిక వ్యూహాలపై దృష్టి పెట్టడంతో మహిళలు తమ ఆర్థిక వ్యవహారాలు నియంత్రించడానికి, అప్పులు తగ్గించడానికి, స్థిరమైన ఆదాయ వనరుల సృష్టికి తగిన సాయం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణ బాబు, మాజీ సర్పంచ్ సాంబశివరావు, ఏపీఎం మహాలక్ష్మి డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పేట తైబజార్ రూ.6 లక్షల 80 వేలు



చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో బుధవారం తైబజార్ వేలం పాట నిర్వహించగా రూ.6లక్షల 80 వేలకు దక్కించుకున్నారు. గ్రామ కార్యదర్శి నాంపల్లి, ఎంపీఓ కరిముల్ల ఆధ్వర్యంలో తైబజార్ వేలం పాటను నిర్వహించగా.. ఏడుగురు వేలం పాటలో పాల్గొన్నారు. రూ.6లక్షల 80 వేల పాట పాడి తైబజార్‌ను నిద్రబోయిన బాగులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో తాజామాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

◆ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా



చిన్నశంకరంపేట(మెదక్): నీటి ఇబ్బందులను అధిగమించేందుకు మండల కేంద్రంలో బుధవారం వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని అందించారు. బుడగజంగాల కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీలో మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని ఇంటింటికీ అందించామని భగీరథ సిబ్బంది తెలిపారు.

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వెల్దుర్తి(తూప్రాన్): ప్రమాదవశాత్తు బావిలోపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందిన ఘటన మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పందుల నర్సింలు(45) ఈనెల 3న గ్రామంలోని ఓ వ్యవసాయం క్షేత్రం వద్ద కూలీ పనులకు వెళ్లి ఓ బావి వద్ద చెట్లకొమ్మలు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. క్షతగాత్రున్ని లక్ష్మక్కపల్లి ఎంవీఆర్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

◆ ఎంపికైన విద్యార్థులు పాఠశాలలో చేరాలి

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని మోడల్‌స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష రాసి, ఎంపికైన విద్యార్థులు వెంటనే పాఠశాలలో చేరాలని ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

◆ వివాహిత మహిళ అదృశ్యం



అదృశ్యమైన రేణుక

చేగుంట(తూప్రాన్): వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటన హవేలీఘనపూర్ మండలం ముత్తాయికోటలో జరిగింది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హవేలీఘనపూర్ మండలం ముత్తాయికోట గ్రామానికి చెందిన బచ్చొల్ల శ్రీనివాస్ తన భార్య రేణుక ఈనెల పదో తేదీన రేణుక ఆధార్ కార్డు అప్‌డెట్ చేయించుకునేందుకు మెదక్ వెళ్తున్నట్లు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లతో పాటు పలు గ్రామాల్లో వెతికినా ఆమె ఆచూకీ దొరకలేదు. బుధవారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.